సాక్షి నిర్మల్

బుధవారం । 29 । నవంబర్ । 2023



భైంసాలో బొమ్మనోట్ల కలకలం..!
భైంసా మండలం సిరాలలో మంగళవారం బొమ్మనోట్ల కలకలం రేగింది. మహారాష్ట్రవాసి వద్ద పట్టుకున్నారు. 2లో▸



చివరి రోజు ఉద్రిక్తత.. 2లో▸
నిర్మల్ జిల్లాలో ప్రశాంతంగా సాగిన ప్రచారం చివరిరోజు ఉద్రిక్తంగా ముగిసింది. బీజేపీ అభ్యర్థి మహేశ్వర్‌రెడ్డి ప్రచారంపై బీఆర్‌ఎస్ నాయకులు దాడిచేశారు.

వాతావరణం
గరిష్టం/కనిష్టం
29.1/19.0
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

స్వేచ్ఛగా ఓటేయండి

- పోలింగ్‌కు 922 కేంద్రాలు సిద్ధం
- ఈసారి వందశాతం ఓటింగ్‌కు చర్యలు
- 'సాక్షి' ఇంటర్వ్యూలో కలెక్టర్ ఆశీష్‌సంగ్వాన్



నిర్మల్: 'జిల్లా ఓటర్లందరూ స్వేచ్ఛగా తమ ఓటుహక్కు వినియోగించుకోవాలి. ఈనెల 30న జిల్లాలోని మొత్తం 922 పోలింగ్ కేంద్రాలన్నీ ఓటర్లతో పోటెత్తాలి. వందశాతం పోలింగ్ లక్ష్యంగా ముందుకు సాగుదాం. ఈ దిశగా జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో అన్ని ఏర్పాట్లూ పూర్తిచేశాం..' అని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ జిల్లా ఓటర్లకు పిలుపునిచ్చారు. ఎన్నికల ఏర్పాట్ల నేపథ్యంలో మంగళవారం నిర్వహించిన 'సాక్షి' ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు.

సాక్షి: ఎన్నికల ఏర్పాట్లు ఎలా ఉన్నాయి..

కలెక్టర్: జిల్లాలోని నిర్మల్, ముథోల్, ఖానాపూర్ మూడు నియోజకవర్గాల్లో ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం. బుధవారం పోలింగ్ అధికారులు, సిబ్బందికి పోలింగ్ సామగ్రిని అందిస్తాం. గురువారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది.

సాక్షి: సమస్యాత్మక పోలింగ్‌కేంద్రాలు ఉన్నాయా.. అక్కడ ఎలాంటి ఏర్పాట్లు చేశారు?

కలెక్టర్ : జిల్లాలో మారుమూల పోలింగ్ కేంద్రాల్లోనూ అన్నిరకాల ఏర్పాట్లు పూర్తిచేశాం. ఖానాపూర్ నియోజకవర్గంలో కొన్ని మావోయిస్టు ప్రభావిత పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. అక్కడ పూర్తిస్థాయి పోలీసు భద్రతను ఏర్పాటు చేశాం. ముథోల్‌లోని ఓ పోలింగ్‌కేంద్రంలో 1,500కు పైగా ఓటర్లు ఉండటంతో అక్కడే రెండు కేంద్రాలుగా వేరుచేశాం.

సాక్షి: ఓటింగ్‌శాతం పెంచేందుకు ఏం చేశారు..

కలెక్టర్ : జిల్లాలో ఓటింగ్‌శాతం పెంచేందుకు స్వీప్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టాం. జిల్లావ్యాప్తంగా అవగాహన సదస్సులు, ర్యాలీలు, మార్నింగ్‌వాక్, రన్, కళాజాత బృందాల కార్యక్రమాలు, బతుకమ్మ, సెల్ఫీపాయింట్లు ఇలా చైతన్య పరిచే కార్యక్రమాలను నిర్వహించాం.

సాక్షి: ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారా?

కలెక్టర్ : ఎన్నికల కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలోనూ ప్రత్యేక పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశాం. ఖానాపూర్ నియోజకవర్గంలో మహిళలకు బుద్ధనగర్, యెంద, పెద్దూర్, తర్లపాడ్, ఇంధన్‌పల్లి, దివ్యాంగులకు ఉట్నూరు, యువతకు కుమ్మరితండాల్లో ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ముథోల్‌లో కుభీర్, ఝరి(బి), భైంసా, కుంటాల, లోకేశ్వరంలో మహిళ, భైంసాలోనే దివ్యాంగుల, యువత కేంద్రాలు ఏర్పాటు చేశాం. నిర్మల్ నియోజకవర్గంలో సోన్, కొట్ల(కె), సిర్గాపూర్, మామడ, నిర్మల్(బంగల్‌పేట్)లో మహిళ, లంగ్డాపూర్‌లో దివ్యాంగ, రాంపూర్‌లో యువత పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశాం.

సాక్షి: ఓటర్లకు మీరిచ్చే సూచనలు..

కలెక్టర్ : జిల్లాలోని ప్రతీ ఓటరు కచ్చితంగా ఓటుహక్కును వినియోగించుకోవాలి. మీతోపాటు మిగతావారినీ కదిలించాలి. ఓటరు ఐడీకార్డు లేదంటే సంబంధిత ఐడీ కార్డులతో వచ్చి ఓటువేయవచ్చు. పోలింగ్ డేను హాలీడేలా కాకుండా ప్రజాస్వామ్యం ఇచ్చిన హక్కును వినియోగించుకునే రోజుగా అందరూ ఓటింగ్‌లో పాల్గొనాలి.

న్యూస్‌రీల్

ఓటర్లను రెచ్చగొడుతున్న బీజేపీ

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



నిర్మల్‌టౌన్: బీజేపీ నాయకులు ఓటర్లను రెచ్చగొట్టి ఓట్లు దండుకునే ప్రయత్నం చేస్తున్నారని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి మండిపడ్డారు. జిల్లా కేంద్రంలోని వైఎస్సార్ కాలనీలో బీఆర్‌ఎస్, బీజేపీ నాయకుల మధ్య మంగళవారం జరిగిన ఘర్షణలపై మంత్రి తన నివాసంలో మాట్లాడారు. ఓడిపోతామనే భయంతోనే బీజేపీ నాయకులు సుమారు 500 మందితో కలిసి వైఎస్సార్ కాలనీలో బీఆర్‌ఎస్ కార్యకర్తలపై దాడులు చేశారని తెలిపారు. నిర్మల్‌లో ఎగిరేది గులాబీ జెండానే అని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ శ్రేణులు సంయమనం పాటించాలని సూచించారు.

ష్.. గప్‌చుప్!



- ముగిసిన ప్రచార పర్వం..
- ప్రలోభాలకు తెరలేపిన నేతలు
- కాలనీల్లో విందు.. ఇంటికే మందు

నిర్మల్‌ఖిల్లా: అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి తెరపడింది. దాదాపు పక్షం రోజులుగా ఉధృతంగా సాగిన ప్రచారం మంగళవారం సాయంత్రం 5 గంటలకు ముగిసింది. దీంతో మైకులు మూగబోయాయి. 20 రోజులుగా సాగిన ప్రచారంలో అన్ని రాజకీయ పార్టీల అభ్యర్థులు తమ గెలుపే లక్ష్యంగా రోడ్‌షోలు, బహిరంగసభలు, పాదయాత్రలు నిర్వహించారు. ఆత్మీయ సమ్మేళనాలు, ర్యాలీలు, మార్నింగ్ వాక్‌లు, గడపగడపకూ వెళ్లి ఓటర్లను ప్రసన్నం చేసుకునే ప్రయత్నం చేశారు. ప్రచార ఘట్టం ముగియడంతో ప్రలోభాల పర్వానికి రాత్రి తెరతీశారు. బుధవారం పతాకస్థాయికి చేరనుంది. రానున్న 24 గంటలపాటు నిర్వహించే తుది ప్రయత్నంలో ఓటర్లకు ఇప్పటికే ప్రలోభాలు ప్రారంభమయ్యాయి. ప్రచారంలో పాల్గొన్న వ్యక్తులు, వారి అనుచరులు ప్రస్తుతం కాలనీల వారీగా గుట్టుచప్పుడు కాకుండా మద్యం, డబ్బు చేరవేస్తున్నారు. కాలనీల్లో, కుల సంఘాల్లో విందులు నిర్వహిస్తున్నారు.

పోల్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి..
ప్రధాన పార్టీల అభ్యర్థులు పోలింగ్‌లో కీలక ఘట్టమైన పోల్ మేనేజ్‌మెంట్‌పైనే దృష్టి సారించారు. గెలుపే లక్ష్యంగా ఇన్నాళ్లు చేసిన ప్రచారం ఒక ఎత్తయితే.. రానున్న 24 గంటల్లో పోల్ మేనేజ్‌మెంట్ కోసం సర్వశక్తులు ఒడ్డుతున్నారు. ఓటర్లకు నేరుగా నగదు, మద్యం పంపిణీ కోసం ప్రణాళికలు రచిస్తున్నారు. ఓటర్ లిస్టు ప్రకారం రాత్రి ఇంటింటికీ డబ్బు, మద్యం అందేలా ఏర్పాట్లు చేశారు. కొన్ని ప్రాంతాల్లో ప్రధాన పార్టీలు ఇప్పటికే నగదు పంపిణీ పూర్తి చేసినట్లు సమాచారం. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి ఓటు విలువ పెరిగింది. ప్రస్తుతం ఒక్కో ఓటుకు రూ.వెయ్యి నుంచి రూ.2 వేల వరకు పంపిణీ చేస్తున్నట్లు తెలుస్తోంది.

ప్రత్యేక పర్యవేక్షకులు..
ఓటర్లకు నగదు పంపిణీ చేసేందుకు ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. వారికి విశ్వసనీయమైన కార్యకర్తలను, అనుచరులను లేదా తమ బంధువులను ఆయా గ్రామాల వారీగా ఇన్‌చార్జులుగా నియమించారు. గ్రామంలో తమ పార్టీ నాయకుడు సూచించిన వారితోపాటు తటస్థులకు డబ్బుల పంపిణీలో మొదటి ప్రాధాన్యం కల్పిస్తున్నారు. ఒక్కో ఓటుకు రూ.వెయ్యి చొప్పున అందిస్తుండగా, ప్రత్యర్థి పార్టీల వారు వెయ్యి కంటే ఎక్కువ ఇస్తే తాము సైతం రెండో దశ మరింత డబ్బు అందించేందుకు సిద్ధమవుతున్నారు. పంపిణీ అవుతున్న డబ్బులు అభ్యర్థికి చేరాయా లేదా అనే అంశంపై ప్రత్యేక బృందాలు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నాయి.

ఎన్నికలకు సర్వం సిద్ధం

- పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత
- డిసెంబర్ 4 వరకు 144 సెక్షన్ అమలు
- ఓటర్లను ప్రలోభపెడితే కఠిన చర్యలు
- ఎస్పీ ప్రవీణ్‌కుమార్



జిల్లా ఎస్పీ సీహెచ్ ప్రవీణ్‌కుమార్

నిర్మల్‌టౌన్: తెలంగాణ శాసనసభ ఎన్నికలకు జిల్లాలో పోలీసులు పూర్తిగా సన్నద్ధమయ్యారని ఎస్పీ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి 1000 మంది పోలీస్ సిబ్బంది, 700 మంది కేంద్ర బలగాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. 100 పెట్రోలింగ్ పార్టీలు, క్విక్ రియాక్షన్ టీమ్స్ ,స్ట్రయికింగ్ ఫోర్స్ , స్పెషల్ స్ట్రయికింగ్ టీమ్స్‌ను సిద్ధం చేశామన్నారు. మంగళవారం సాయత్రం 5 గంటలకు తమకు కేటాయించిన స్థానాల్లోకి వెళ్లారని తెలిపారు.

పాటించవలసిన ఎన్నికల నిబంధనలు

- మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి డిసెంబర్ 04 ఉదయం 6 గంటల వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుంది.
- స్థానికేతర నాయకులు నియోజకవర్గాలను విడిచి వెళ్లిపోవాలి. లాడ్జీకి రాజకీయ పార్టీల వ్యక్తులు, అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటు హక్కు లేని వ్యక్తులు బస చేయడానికి వస్తే వారిని అనుమతించొద్దు.
- ఈనెల 30న ఓట్లు వేసే ఓటర్లను ప్రభావితం చేయడానికి రాజకీయ పార్టీ బ్యానర్లు, లోగోలు ఏర్పాటు చేయకూడదు.
- పోలింగ్ రోజు 200 మీటర్ల దూరంలో రాజకీయ పార్టీల వాళ్లు పోల్ చిట్టీలు ఇవ్వడానికి సూచించిన మేరకు చిన్న స్టాల్‌ను ఏర్పాటు చేసుకుని, అందులో ఇద్దరే ఉండాలి.
- పోలింగ్ స్టేషన్‌కు 100 మీటర్ల పరిధిలో ఉన్న ఇళ్ల యాజమానులు బయటి వ్యక్తులను ఎవ్వరినీ అనుమతించకూడదు.
- ఓటర్లను ఎవ్వరూ ప్రలోభపెట్టకూడదు, భయభ్రాంతులకు గురిచేయవద్దు.
- ఈనెల 28 సాయంత్రం 5 గంటల నుంచి డిసెంబర్ 4 వరకు ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం చర్యలు తీసుకుంటారు.

మూడో విడత ర్యాండమైజేషన్ పూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: అసెంబ్లీ ఎన్నికల విధులకు సంబంధించి పోలింగ్ కేంద్రాల వారీగా మూడో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ సాధారణ పరిశీలకుల రవిరంజన్‌కుమార్ విక్రమ్, కె.గోపాల కృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం పూర్తయిందని జిల్లా ఎన్నికల అధికారి ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. ఎన్నికల సిబ్బందికి, ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు కలెక్టరేట్ మినీ సమావేశం మందిరంలో ర్యాండమైజేషన్ ప్రక్రియను స్క్రీన్ ద్వారా చూపించారు. నిర్మల్, ముథోల్, ఖానాపూర్ నియోజకవర్గాల పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల విధులు నిర్వహించే ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్, మైక్రో అబ్జర్వర్స్ విధులను యాదృచ్ఛికంగా కేటాయించారు. మూడు నియోజకవర్గాల వారీగా పోలింగ్ కేంద్రాలకు సిబ్బందిని కేటాయించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. కేటాయించిన సిబ్బంది వివరాలు షీల్డ్ కవర్‌లో ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులకు పంపినట్లు పేర్కొన్నారు. నిర్మల్‌లో 306 పోలింగ్ కేంద్రాలకు 305 టీమ్స్, ముథోల్‌లో 312 పోలింగ్ కేంద్రాలకు 311 టీమ్స్, ఖానాపూర్‌లో 305 పోలింగ్ కేంద్రాలకు 304 టీమ్స్ అందుబాటులో ఉన్నాయని వివరించారు. నియోజకవర్గానికి ఐదు చొప్పున మహిళా పోలింగ్ కేంద్రాలు, ఒక్కో యూత్ పోలింగ్ కేంద్రాలు అందుబాటులో ఉన్నాయన్నారు. నిర్మల్లో 47, ఖానాపూర్‌లో 58, ముథోల్‌లో 50 మంది మైక్రో అబ్జర్వర్లు ఉన్నారని తెలిపారు. పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన సిబ్బంది పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

కౌంటింగ్‌పై అవగాహన ఉండాలి
నిర్మల్‌చైన్‌గేట్: కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు కౌంటింగ్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి ఆశిష్ సంగ్వాన్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లకు వారి విధులపై, జిల్లాస్థాయి మాస్టర్ శిక్షకులు లక్ష్మణ్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల్లో ముఖ్యమైన ఘట్టం కౌంటింగ్ అని ఎలాంటి పొరపాట్లు జరగకుండా కౌంటింగ్ సిబ్బంది విధులు నిర్వహించాలని సూచించారు. కౌంటింగ్ కోసం కేటాయించిన సిబ్బంది అందరూ పూర్తి అవగాహనతోపాటు సమయస్ఫూర్తి కలిగి ఉండాలన్నారు. కౌంటింగ్‌లో భాగంగా ముందుగా పోస్టల్ బ్యాలెట్‌ను లెక్కించాలన్నారు. ఎన్నికల పరిశీలకుల ఆధ్వర్యంలో ఓట్ల లెక్కింపు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కౌంటింగ్ కేంద్రాన్ని నిర్మల్ కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లాలోని మూడు నియోజకవర్గాలకు సంబంధించిన కౌంటింగ్ ఇక్కడే జరుగుతుందని పేర్కొన్నారు. ఓట్ల లెక్కింపులో భాగంగా సిబ్బంది అందరికీ ఓటింగ్ యంత్రాలపై పూర్తి అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో డీఈవో రవీందర్ సిబ్బంది పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోవాలి



జిల్లా పోలీస్ అధికారులు, కేంద్ర బలగాల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ ప్రవీణ్‌కుమార్

నిర్మల్‌టౌన్: ఈనెల 30న ఓటర్లు స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోవాలని ఎస్పీ ప్రవీణ్‌కుమార్ సూచించారు. జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో పోలీస్ అధికారులు, కేంద్ర బలగాల అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. నవంబర్ 30న అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి కేంద్ర బలగాలు, జిల్లా పోలీసులతో కలిసి ఎన్నికల ముందు, పోలింగ్ రోజు, ఎన్నికల తరువాత ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని ఆదేశించారు. సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లలో స్టాటిక్ బందోబస్తు, మిగతా ఫోర్స్ రూట్ బందోబస్తు, అత్యవసర పరిస్థితి సమయంలో విధులు నిర్వహించాలన్నారు. ఎస్ఎస్టీ టీమ్స్ డ్యూటీలు, చెక్‌పోస్ట్ విధుల గురించి వారికి వివరించారు. కీలకమైన పాయింట్‌ల వద్ద కేంద్ర బలగాలను ఉంచుతామన్నారు. చెక్‌పోస్టుల్లో చాలా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఓటింగ్ అనంతరం ఈవీఎం బాక్స్‌లను స్ట్రాంగ్‌రూమ్‌కు తరలించే వరకు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు ఎస్పీ వీరన్న, అదనపు ఎస్పీ(ఏఆర్) వెంకటేశ్వర్లు, నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఆర్ఐలు రమేశ్, రాంనిరంజన్ పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో కలెక్టరేట్ నిర్మిస్తాం



పట్టణంలో ప్రచారం నిర్వహిస్తున్న శ్రీహరిరావు

నిర్మల్‌చైన్‌గేట్: తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే నిర్మల్ జిల్లా కేంద్రంలో ప్రజలకు అందుబాటులో ఉండేలా కలెక్టరేట్ భవనం నిర్మిస్తామని కాంగ్రెస్ నిర్మల్ అభ్యర్థి కూచాడి శ్రీహరిరావు తెలిపారు. ప్రస్తుత సమీకృత కలెక్టరేట్ భవనాన్ని కళాశాల లేదా ఆస్పత్రి కోసం ఉపయోగిస్తామని పేర్కొన్నారు. సోన్ మండలం, నిర్మల్‌లోని ఆదర్శనగర్ చెందిన బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు మంగళవారం కాంగ్రెస్‌లో చేరగా, వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. జిల్లా ఏర్పాటుతో ప్రజలు ఎంతో సంతోషించారని, అయితే కొత్త కలెక్టరేట్ నిర్మాణంతో ఆ సంతోషం ఆవిరైందని తెలిపారు. మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి తన బంధువుల భూముల రేట్లు పెంచుకునేందుకు కలెక్టరేట్‌ను ఎల్లపల్లి శివారులో నిర్మింపజేశారని ఆరోపించారు. బీఆర్‌ఎస్‌ను మళ్లీ గెలిపిస్తే బస్టాండ్, బస్ డిపోను కూడా అక్కడికే తరలించే అవకాశం ఉందన్నారు. 30న జరగబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటువేసి తనను గెలిపించాలని కోరారు.

నిర్మల్‌లో కాంగ్రెస్ ప్రచారం..
ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా నిర్మల్ పట్టణంలోని గాంధీ పార్కు, గుల్జార్ మార్కెట్, వివేక్‌చౌక్ నుంచి బస్టాండ్ తదితర ప్రాంతాల్లో ప్రచారం కాంగ్రెస్ నిర్మల్ నియోజకవర్గ అభ్యర్థి శ్రీహరిరావు ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన అభయహస్తం హామీలను, 6 గ్యారంటీలను ప్రజలకు వివరించారు. నవంబర్ 30న హస్తం గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు.

ఉద్దేశపూర్వకంగానే దాడి

- బీజేపీ అభ్యర్థి ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని వైఎస్సార్ నగర్‌లో తాము చేస్తున్న ప్రచారంపై బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఉద్దేశపూర్వకంగానే దాడి చేశారని బీజేపీ నిర్మల్ అభ్యర్థి ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని మహేశ్వర్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో మంగళవారం మాట్లాడారు. 20 ఏళ్ల తన రాజకీయ చరిత్రలో ఒక్క మచ్చ కూడా లేదన్నారు. ఒకవర్గం ఓటు బ్యాంకు కోసమే మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి కొంతమంది యువకులతో దాడి చేయించారని ఆరోపించారు. ఈ దాడిలో బీజేపీ కార్యకర్త చేతి వేళ్లు విరిగాయన్నారు. పోలీసులు సమయానికి రాకపోతే తనపై కూడా దాడి జరిగేదన్నారు. బీఆర్‌ఎస్ ఓడిపోతుందనే భయంతో భౌతికదాడికి పాల్పడుతున్నారని ఆరోపించారు.

అధిక మెజార్టీతో గెలిపించాలి..
ఈనెల 30న జరగబోయే అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీకి ఓటు వేసి తనను అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. బీజేపీ అధికారంలోకి వస్తేనే అర్హులైన నిరుపేదలందరికీ ఇళ్ల నిర్మాణం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు అయ్యన్న గారి భూమయ్య, జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు సాదం అరవింద్, మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, మల్లికార్జున్ రెడ్డి, మెడిసమ్మె రాజు, అర్జున్ పాల్గొన్నారు.

చేతినిండా పని కావాలి

- సంక్షేమ పథకాలు రావు.. పింఛన్లు లేవు
- మండలానికో ఈఎస్ఐ ఆసుపత్రి అవసరం
- జిల్లా బీడీ కార్మికుల ఆకాంక్ష



బీడీలు చేస్తున్న కార్మికులు

భైంసా: జిల్లాలో లక్ష మంది బీడీ కార్మికులు ఉన్నారు. జిల్లాలో ఏ ఊరికి వెళ్లిన ప్రతీ ఇంట్లో బీడీలు చుట్టే మహిళలే కనిపిస్తారు. వ్యవసాయం తర్వాత ప్రధాన జీవనోపాధి బీడీ పరిశ్రమే. ఈ పరిశ్రమను నమ్ముకుని లక్ష మంది కార్మిక కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడకముందు బీడీ కార్మికుల ఇబ్బందులను తెలుసుకున్న సీఎం కేసీఆర్ పీఎఫ్ ఉన్న కార్మికులకు ప్రతీనెల రూ.2,016 చొప్పున ఆసరా కింద జీవనభృతి ఇస్తున్నారు. తాజాగా బీడీ టేకేదారులకు ఈ భృతిని విస్తరించారు.

కటాఫ్ తేదీతో ఇబ్బందులు..
2014కు ముందు పీఎఫ్ ఉన్న బీడీ కార్మికులకే పింఛన్లు అందుతున్నాయి. కటాఫ్ తేదీని తీసేసి పీఎఫ్ ఉన్న కార్మికులందరికీ జీవనభృతి కల్పించాలని జిల్లా కార్మికులు కోరుతున్నారు. జిల్లావ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లోనూ ఈ విషయంపై గతంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. వేల సంఖ్యలో దరఖాస్తులు చేసుకున్న కార్మికులు కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్నారు. తాజాగా అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఈ విషయం మరోమారు తెరపైకి వచ్చింది. కటాఫ్ తేదీని తొలగించి అందరికీ పింఛన్లు ఇవ్వాలంటూ భైంసా బహిరంగసభలో తాజామాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి సీఎం కేసీఆర్‌కు విన్నవించగా ఆయన సానుకూలంగా స్పందించారు. వేలాది కార్మికులు గ్రామాల్లో బీడీలు చుట్టే కార్మికులతోపాటు ఈ పరిశ్రమలో బీడీ చెక్కర్లు, బీడీ ప్యాకర్లు, గంపావాలా, బట్టిమ్యాన్‌లు ఉన్నారు. వేలాదిగా ఉన్న ఈ కార్మికులంతా చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నారు. చేతినిండా పని ఉంటే ఎవరి ఆసరా అవసరంలేదని ఈ కార్మికులు చెబుతున్నారు. బీడీ పరిశ్రమలనే నమ్ముకుని బతుకుతున్న ఈ కార్మికులందరికి జీవనభృతి ఇవ్వాలన్నదే ప్రధాన డిమాండ్‌గా ఉంది. అసెంబ్లీ ఎన్నికల వేళ.. డిసెంబర్ 3 తర్వాత ఏర్పడే కొత్త ప్రభుత్వం నుంచి బీడీ కార్మికులు ఆశిస్తున్న అంశాలు వారి మాటల్లో..

కటాఫ్ తేదీ ఎత్తేయాలి..




చేతినిండా పనిలేని ఈ పరిశ్రమలో మా ఇబ్బందులను గుర్తించి ప్రభుత్వం జీవనభృతిని అందిస్తుంది. కటాఫ్ తేదీని తొలగించి బీడీలు చుట్టే కార్మికులందరికీ పింఛన్లు ఇవ్వాలి. ఆరేళ్లుగా మాతో పనిచేసే కార్మికులంతా కొత్త పింఛన్లు ఇవ్వాలని కోరుతున్నారు. – గీత, కల్లూరు

చేతినిండా పని కల్పించాలి




బీడీలు చుట్టే కార్మికులకు చేతినిండా పనికల్పించాలి. 26 రోజులు పని ఇవ్వాలి. పరిశ్రమలో అనుకున్నంతగా పనులు దొరకడంలేదు. రోజు సరిపడా పనిలేక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాం. ఇప్పటికైనా బీడీ పరిశ్రమలో పనిచేసే కార్మికులకు చేతినిండా పని కల్పించాలి.
– ముత్తక్క, కుంటాల

పిల్లలకు రిజర్వేషన్ ఇవ్వాలి




పాఠశాలలో చదివేందుకు బీడీ కార్మికుల పిల్లలకు ప్రత్యేక సీట్లు కేటాయించాలి. ఉద్యోగాల విషయంలోనూ బీడీ కార్మికుల పిల్లలకు రిజర్వేషన్ ఉండాలి. ఏ ఆధారంలేకుండా బీడీలనే నమ్ముకుని బతుకుతున్న కార్మిక కుటుంబాల్లో పిల్లలకైనా ఉద్యోగాల కల్పనలో రిజర్వేషన్ ఇవ్వాలి.
– రాధ, కుంటాల

ఆరోగ్యబీమా కల్పించాలి



బీడీ పరిశ్రమలో పనిచేసేవారిలో ఎక్కువ మంది రోగాలబారిన పడుతున్నారు. అనారోగ్యంతో ఇబ్బంది పడే వారికి ఉత్తమ చికిత్సలు అందించాలి. బీడీ కార్మికులందరికి ఆరోగ్యబీమా వర్తింపజేయాలి. మండలానికో ఈఎస్ఐ ఆసుపత్రిని ఏర్పాటుచేసి వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చూడాలి.
– లక్ష్మి, కుంటాల

సంక్షేమ పథకాలు అమలు చేయాలి



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీడీ కార్మికుల కోసం సంక్షేమ పథకాలను అమలుచేయాలి. గృహనిర్మాణ పథకం పూర్తిస్థాయిలో అమలుకావడంలేదు. పిల్లల చదువులకు ఉపకారవేతనాలు అందడంలేదు. సంక్షేమ పథకాలపై బీడీ కార్మికులకు అవగాహన కల్పించాలి.
– రాజమణి, కుంటాల

క్లుప్తంగా

మహిళలపై తేనెటీగల దాడి



తేనెటీగల దాడిలో గాయపడిన మహిళలు

కుంటాల: మండలంలోని దౌనెల్లిలో తేనెటీగల దాడిలో ఇద్దరు మహిళలకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన గోపి చిన్నక్క, లక్ష్మి వ్యవసాయ పనుల నిమిత్తం పంట చేనులోకి వెళ్లారు. ఓ చెట్టు పైనుంచి తేనెటీగలు గుంపుగా వచ్చి వీరిపై దాడి చేయడంతో ముఖానికి, చేతులకు తీవ్రగాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు.

విద్యార్థి మృతికి సంతాపం



సంతాపం వ్యక్తం చేస్తున్న అధ్యాపకులు

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీలో ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న రామాటి ప్రవీణ్‌కుమార్ మృతిపై సంతాపం తెలిపారు. మంగళవారం యూనివర్సిటీ పరిపాలన భవనంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన సంతాప సభలో ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఎంతో భవిష్యత్ ఉన్న విద్యార్థి అకాల మృతి బాధాకరమని వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జీవితంపై విరక్తితో ఒకరి ఆత్మహత్య

కుభీర్: జీవితంపై విరక్తితో ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని శివుడి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మొట్టు భీమ్ (45) కూలీ పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. తన ఇద్దరు బిడ్డలకు వివాహం చేశాడు. వారి పెళ్లికి కొంత ప్రైవేటుగా అప్పులు చేశాడు. అప్పులు ఎలా తీర్చాలనే బెంగతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య పోసాని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

విద్యుత్ వైర్లు తగిలి రైతు మృతి



లింగన్న(ఫైల్)

బోథ్: విద్యుత్ తీగలు తగిలి రైతు మృతిచెందిన సంఘటన మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై రాము వివరాల ప్రకారం.. మండలంలోని కంటిగాం గ్రామానికి చెందిన పెందూర్ లింగన్న (23) సోమవారం సాయంత్రం 5గంటల ప్రాంతంలో తన చేను నుంచి ఎద్దులు తీసుకువస్తానని భార్య సురేఖతో చెప్పి వెళ్లాడు. రాత్రి దాటినా ఇంటికి రాలేదు. మంగళవారం ఉదయం ఆరుగంటల ప్రాంతంలో గ్రామ పటేల్ ఆడెం భీంరావ్, ఆత్రం ముకుంద్ రావులతో కలిసి గాలించగా ఆడె తోలరాం అనే వ్యక్తి చేనులో మృతిచెంది కనిపించాడు. తోలరాం తన చేనులో పత్తి పంట సంరక్షణకు విద్యుత్ కంచెను ఏర్పాటు చేయడంతో ఆ వైర్లు తగలడంతోనే తన భర్త మృతి చెందాడని సురేఖ వాపోయింది. సోమవారం విద్యుత్ వైర్లు తొలగించాలని చెప్పినా తోలరాం నిర్లక్ష్యపు సమాధానం ఇచ్చాడని, విద్యుత్ కంచె తొలగించకపోవడంతోనే తన భర్త మృతిచెందాడని సురేఖ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

వణికిస్తున్న చలి



ఉదయం ఏడు గంటలకు ప్రధాన రోడ్డుపై కమ్ముకున్న పొగ మంచు



పొలాల్లో కమ్ముకున్న పొగ మంచు



పొగమంచులో వాకింగ్ చేస్తున్న వకర్స్



ఎనిమిది గంటలకు చలిమంట కాగుతున్న వృద్ధుడు





ఉదయం ఏడు గంటలకు కమ్ముకున్న పొగమంచు



ఉదయం ఎనిమిది గంటలకు పట్టణంలో మంచు..

మూడు రోజుల నుంచి వాతావరణంలో మార్పులు కావడంతో జిల్లా వాసులు వణుకుతున్నారు. జిల్లాలో ఒక్కసారిగా చలి తీవ్రత పెరిగిపోవడంతో మూడు రోజుల నుంచి ఉష్ణోగ్రతలు అంతకంతకు పడిపోతున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకూ పొగమంచు కొమ్ముకుని ఉండడంతో ఎక్కడ చూసినా మబ్బులు కమ్ముకుని కనిపిస్తున్నాయి. రాత్రి వేల వర్షం కురవడంతో చల్లని వాతావరణంతో చిన్న పిల్లలు, వృద్ధులు, చలి తీవ్రతతో ఇబ్బంది పడుతున్నారు. ఉదయం 7గంటల వరకు రహదారులపై పొగ మంచు కమ్ముకోడంతో వాహనదారులు హెడ్‌లైట్స్ వేసుకుని వాహనాలపై వెళ్లాల్సి వస్తుంది. వివిధ పనుల నిమిత్తం స్వెట్టర్ వేసుకుని వెళ్లాల్సి వస్తోందని జిల్లా వాసులు వాపోతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

ప్రచార శైలిలో మార్పులు..

- కాలినడక నుంచి హెలీక్యాప్టర్ వరకు
- ప్రచారాల్లో జాతీయ నాయకులు సైతం
- పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజం

జంగ్ తెలంగాణ



మంచిర్యాలరూరల్(హాజీపూర్): నాటి నుంచి నేటి వరకు ప్రచార శైలిలో వినూత్న మార్పులు చోటు చేసుకున్నాయి. నాడు కేవలం కాలినడకన జరిపే ప్రచారం ఇప్పుడు హెలీక్యాప్టర్ల వరకు చేరుకుంది. అప్పుడు ప్రచారానికి అన్నిమార్గాలను వినియోగిస్తూ ప్రజలకు చేరువయ్యారు. బీఆర్‌ఎస్ పార్టీ నుంచి సీఎం కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, బీజేపీ నుంచి అమిత్‌షా, ఈటల రాజేందర్, యోగి ఆదిత్యనాథ్, కిషన్‌రెడ్డి, బండి సంజయ్, కాంగ్రెస్ నుంచి మల్లికార్జునఖర్గే, రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి ఇలా ప్రముఖులు హెలీక్యాప్టర్లలో వచ్చి ప్రచార సభల్లో పాల్గొని పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజం నింపారు.

ఉదయం నుంచి రాత్రి వరకు..

గతంలో చేతిలో మైకు చేతపట్టుకుని రిక్షాల్లో తిరుగుతూ ఇంటింటా ప్రచారం చేసేవారు. సైకిళ్లు, ఎడ్ల బండ్లతోపాటు జీపులను వినియోగిస్తూ ప్రచారం చేపట్టేవారు. కానీ ఇప్పుడు ఆటోలు, టాటా ఏస్‌లల్లో బ్లూటూత్, డీజే సౌండ్ ఏర్పాటు చేసి తమ పార్టీ గుర్తుకు ఓటేస్తే అభివృద్ధి చేస్తామంటూ పెద్దపెద్ద స్పీకర్లు పెట్టి పొద్దంతా ప్రచారం చేస్తున్నారు. తిరగకుండా, అలసిపోకుండా ఈ ఆటోప్రచారం బలాన్ని చేకూరుస్తోంది. పాదయాత్రలు, బైక్‌ర్యాలీలతో ప్రచారం చేస్తుండటంతో పాటు వివిధ రకాల కార్లతో పెద్ద కాన్వాయ్‌తో గ్రామ, పట్టణ ప్రాంతాల్లోని ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఏ గ్రామానికి, ఏ పట్టణానికి వెళ్లినా ఆయా పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు మందీ మార్బలంతో పదుల సంఖ్యలో కార్లు, ఇతర వాహనాల్లో వెళ్తూ ప్రచారం చేశారు.

ఆకాశ మార్గాన ప్రచారాల్లో ప్రముఖులు

ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు జాతీయ స్థాయి ప్రముఖులు హెలీక్యాప్టర్లలో పార్టీల ప్రచారానికి వస్తూ ఓ వైపు ఓటర్లను ఆకర్షిస్తూ మరోవైపు పార్టీ కార్యకర్తల్లో జోష్ నింపారు. పార్టీ బహిరంగ సభలు ఎక్కడున్నా ఆ పార్టీల ప్రముఖులు త్వరితగతిన చేరుకుని ప్రచారం చేశారు. ఒక్కరోజులో నాలుగు సభల్లో పాల్గొంటూ ప్రచారాన్ని హోరెత్తించారు. తక్కువ సమయంలో ఎక్కువ సభలను చుట్టేస్తూ బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ పార్టీల ప్రముఖులు హెలీక్యాప్టర్లను ఉపయోగించారు. గతంలో ఎక్కడ సభలు ఉన్నా రోడ్డు మార్గాన వెళ్లే నేతలు ఇప్పుడు ఆకాశ మార్గాన వెళ్తూ రోడ్ షోలు, సభల్లో పాల్గొన్నారు.

భారీ మైదానాలు.. ఎల్‌ఈడీ తెరలు

అప్పట్లో చెట్ల కింద, రచ్చబండల వద్ద సభలు, సమావేశాలు జరిగేవి. ఇప్పుడు విశాలమైన మైదానాల్లో పెద్ద పెద్ద షామియానాలు ఏర్పాటు చేస్తూ కుర్చీలు వేస్తూ మరీ ప్రజల మద్దతు కూడగట్టే ప్రయత్నం చేశారు. ప్రత్యేక వాహనాల్లో ఎల్‌ఈడీ తెరలు ఏర్పాటు చేసి మరీ వీడియోలు, తాము చేసే కార్యక్రమాలను వివరిస్తూ ప్రజల్లో తమ పార్టీలపై అభిమానం పెంచుకునేలా చూశారు. చివరన రోడ్‌షోలతో ప్రచారానికి మరింత ఊపునిచ్చారు. ప్రధాన కూడళ్లలో పార్టీ ప్రధాన నేతల ప్రసంగాలను ఎల్‌ఈడీ తెరల ద్వారా వీక్షించేలా ఏర్పాటు చేశారు.

గుస్సాడీలు.. కళాకారుల సందడి

గిరిజన సంప్రదాయాలతో పాటు జానపద కళాకారులతో కూడా పార్టీలు ప్రచారం నిర్వహించాయి. ప్రచారాలకు ప్రముఖులు వచ్చే ముందు గుస్సాడీల నృత్యాలు, కళాకారుల ఆటపాటలతో ప్రజలను అలరించారు. ఎమ్మెల్యేగా గెలిస్తే తాము చేసే పనులను పాటల రూపంలో వివరిస్తూ హోరెత్తించారు. మొత్తంగా ఎన్నికల ప్రచారానికి తెరపడడంతో పార్టీల ప్రచారం ప్రశాంతంగా ముగిసింది.

భైంసాలో బొమ్మనోట్ల కలకలం..!



చేలల్లో పాడవేసిన నోట్లు



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్

- అనుమానాస్పదంగా కారుతో పరారీ
- వెంబడించిన పోలీసులు, చేలల్లో నోట్లు పారేసిన వైనం

భైంసాటౌన్: భైంసా మండలంలోని సిరాల ప్రాంతంలో మంగళవారం బొమ్మనోట్ల కలకలం రేగింది. వివరాల్లోకి వెళితే.. మహారాష్ట్ర నుంచి అనుమానాస్పదంగా కారులో ఓ వ్యక్తి భైంసా వైపు వస్తుండగా, భైంసాలోని భోకర్ చౌరస్తా వద్ద పోలీసులను చూసి కారును దేగాం వైపు మళ్లించాడు. దీంతో అనుమానం వచ్చిన పోలీసులు కారును వెంబడించగా ఇలేగాం మీదుగా సిరాల వైపు వెళ్లాడు. అక్కడి నుంచి రోడ్డుమార్గం లేక కారును అక్కడే నిలిపేసి కారులో ఉన్న నోట్లను చేలల్లో విసిరేశాడు. దీంతో కొందరు స్థానికులు ఆ నోట్లను తీసుకుని వెళ్లిపోగా పోలీసులు సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకుని రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అతడిని విచారించగా పిల్లలు ఆడుకునే బొమ్మనోట్లు అని తేలింది. ఎన్నికల్లో డబ్బులు పంచేందుకు నోట్లు తరలిస్తున్నారని సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

అవి పిల్లలు ఆడుకునే నోట్లే : – ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్

కారులో నోట్లు తరలిస్తున్నారన్న వార్త సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో మంగళవారం సాయంత్రం ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్ తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రలోని భోకర్‌కు చెందిన సూర్యవంశీ సచిన్ అనే వ్యక్తి కారులో వాసీం జిల్లాకు చెందిన యోగేశ్ హింగోలి అనే వ్యక్తి వద్ద నుంచి పిల్లలు ఆడుకునే నోట్లను చంద్రపూర్‌లోని పంకజ్ చౌదరి అనే వ్యక్తికి అప్పగించేందుకు కారులో తరలిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో తేలినట్లు పేర్కొన్నారు. సదరు వ్యక్తి నుంచి 550 బొమ్మనోట్లను స్వాధీనం చేసుకున్నామని, బొమ్మ నోట్ల తరలింపు వెనుక అసలు కారణాలను విచారణలో తేలుస్తామన్నారు. ఈ సమావేశంలో రూరల్ సీఐ నైలునాయక్, ఎస్సై శ్రీకాంత్ ఉన్నారు.

భారీగా మద్యం స్వాధీనం

- రూ.లక్షా 80వేల విలువ గల మద్యం సీజ్
- ఏడు వాహనాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో పోలీసులు



పట్టుకున్న మద్యంతో ఎస్సై నరేష్, సిబ్బంది

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని వివిధ ప్రాంతాల్లో సీసీఎస్ పోలీసులు మంగళవారం విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. అక్రమంగా మద్యం తరలిస్తున్న వారిని పట్టుకొని కేసు నమోదు చేశారు. రూ.లక్షా 80వేల విలువ గల మద్యంతో పాటు ఏడు వాహనాలను సీజ్ చేసి పలువురిని అరెస్టు చేశారు. పట్టణంలోని రవితేజ హోటల్ సమీపంలో తలమడుగు మండలానికి చెందిన అరుణ్‌రాజ్ వద్ద రూ.72వేల విలువ చేసే 395బాటిళ్లను, కలెక్టర్ చౌక్‌లో నేరడిగొండకు చెందిన ఆడెపు రమేష్ వద్ద నుంచి రూ.30వేల విలువైన 73 బాటిళ్లను సీజ్ చేశారు. నేరడిగొండ మండలానికి చెందిన నాగేందర్ కలెక్టర్ చౌక్ వద్ద రూ.11వేల 500 విలువ గల 46 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా బస్టాండ్ సమీపంలో జైనథ్ మండలానికి చెందిన సాయికృష్ణ వద్ద నుంచి రూ.15వేల 350 విలువ గల 48 బాటిళ్లను, వినాయక్ చౌక్ వద్ద దీపాయిగూడకు చెందిన గేడపు ప్రపు వద్ద రూ.21వేలా 120 విలువ గల 16 బాటిళ్లను పట్టుకున్నారు. అలాగే రైల్వే స్టేషన్ సమీపంలో పట్టణానికి చెందిన ఎల్మ ఉపేందర్ వద్ద నుంచి రూ.8వేల విలువగల 44బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ సాయినాథ్ తెలిపారు.

ఇచ్చోడ: మండలంలో మంగళవారం అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టుకున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు. అక్రమంగా ఆటోలో అక్రమంగా మద్యం తరలిస్తుండగా స్థానిక ఆరోగ్య కేంద్రం దాదాపుగా రూ.51వేల మద్యం పట్టుకున్నట్లు తెలిపారు. మద్యం తరలిస్తున్న సల్యాద గ్రామానికి చెందిన గోడం రామరావును పట్టుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

మద్యం పట్టివేత... ఇద్దరిపై కేసు

కుంటాల: కుంటాలలో అక్రమంగా మద్యం నిల్వ ఉంచుకున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై హన్మాండ్లు పేర్కొన్నారు. బీహార్‌కు చెందిన బసంత్ కుమార్ వద్ద రూ.3600 విలువ గల ఆరు లీటర్ల మద్యం, సిందే మారుతి వద్ద రూ.3900 విలువ గల 15లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వెల్లడించాడు.

చివరి రోజు ఉద్రిక్తత..

- బీఆర్‌ఎస్, బీజేపీ పరస్పరం దాడులు
- పోటాపోటీగా పాటలతో ఉద్రిక్తత
- పలువురికి తీవ్రగాయాలు
- ఇరువర్గాలపై కేసు



వైఎస్‌ఆర్ కాలనీలో బీజేపీ, బీఆర్‌ఎస్ మధ్య దాడి

నిర్మల్: నిర్మల్ జిల్లాలో ప్రశాంతంగా సాగిన ప్రచారపర్వం చివరిరోజు ఒక్క ఘటనతో ఉద్రిక్తంగా ముగిసింది. జిల్లాకేంద్రంలోని వైఎస్సార్‌కాలనీలో మంగళవారం ఉదయం బీజేపీ అభ్యర్థి మహేశ్వర్‌రెడ్డి, పార్టీ నాయకులతో ప్రచారానికి వెళ్లాడు. అదే సమయానికి బీఆర్‌ఎస్ నాయకులు ప్రచార వాహనంతో వచ్చారు. పోటాపోటీగా పాటలు పెట్టవద్దన్న అంశంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడింది. ఒక్కసారిగా బీజేపీ నాయకులపై బీఆర్‌ఎస్ నాయకులు రాళ్లతో దాడి చేశారు. దీంతో బీజేపీ నాయకుల కూడా ప్రతిదాడికి దిగారు. ఇరువర్గాలు రాళ్లు, కర్రలతో దాడులు చేసుకోవడంతో వైఎస్సార్ కాలనీ ఉద్రిక్తంగా మారింది. పలువురు స్థానికులు, కార్యకర్తలకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న డీఎస్పీ గంగారెడ్డి, సీఐలు శ్రీనివాస్, పురుషోత్తం వెంటనే అక్కడి చేరుకున్నారు. భారీసంఖ్యలో పోలీసులను మోహరించారు. ఇరుపార్టీల నాయకులను చెదరగొట్టారు. అనంతరం బీజేపీ అభ్యర్థి మహేశ్వర్‌రెడ్డి తన ప్రచారం కొనసాగించారు. ఈ ఘటనకు సంబంధించి పలువురిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఎన్నికలు బహిష్కరిస్తున్నట్లు తీర్మానం

పెంబి: మండలంలోని గుమ్మెన గ్రామ పంచాయతీ పరిధిలో ఎంగ్లాపూర్, గోండుగూడ, నాయకపుగూడ గ్రామ ప్రజలు అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరిస్తున్నట్లు ఆయా గ్రామస్తులు మంగళవారం తీర్మానించారు. ఈ సందర్భంగా ప్రతి ఐదు సంవత్సరాలకు ఎన్నికలు గుర్తుకు వచ్చినప్పుడు మాత్రమే మా గ్రామానికి నాయకులు వస్తున్నారని, సమస్యలు తీర్చేందుకు రావడం లేదన్నారు. కనీసం రోడ్డు, త్రీఫేజ్ సౌకర్యాలు లేదని, మండల కేంద్రానికి వెళ్లాలంటే అటవీ ప్రాంతం నుంచి వాగులు, ఒర్రెలు దాటి వెళ్లాల్సి వస్తుందని వివరించారు. గుమ్మెన గ్రామ పంచాయతీ పరిధిలో మొత్తం ఓటర్లు 402 ఉండగా పురుషులు 195, మహిళలు 207 ఉన్నారు.



మాట్లాడుతున్న గుమ్మెన గ్రామ ప్రజలు

జ్యోతిబాపూలేతోనే సామాజిక ఉద్యమానికి నాంది

- మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పెట్కులే



నివాళులర్పిస్తున్న మాలీ సంఘం నేతలు

ఆదిలాబాద్‌రూరల్: భారతదేశంలో సామాజిక ఉద్యమానికి నాంది పలికింది మహాత్మా జ్యోతిబాపూలేనని అఖిల భారతీయ మాలీ మహాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పేట్కులే అన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే 133వ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమశాఖ ఆవరణలోని జ్యోతిబాపూలే దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం, చిన్న కులాల హక్కుల కోసం, సామాజిక న్యాయం కోసం ఆజన్మాంతం కృషి చేసిన మహోన్నత వ్యక్తి మహాత్మాజ్యోతిరావు పూలే అన్నారు. భారత ప్రభుత్వం పూలే దంపతులకు భారతరత్నతో గౌరవించాలన్నారు. పూలే దంపతుల జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో ప్రచురించాలన్నారు. ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబన్న శేండే, మాలీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ అంబేకర్, పట్టణ అధ్యక్షులు శ్రీను ఆచారి, ప్రధాన కార్యదర్శి సుభాష్ శెండే, కార్యవర్గ సభ్యులు అనిల్ కోట్రంగే ఉన్నారు.

ట్రాక్టర్‌ను ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు



రోడ్డుపై పల్టీ కొట్టిన ట్రాక్టర్

భైంసారూరల్: భైంసా – బాసర ప్రధాన రహదారిపై దేగాం గ్రామం వద్ద ట్రాక్టర్‌ను ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. స్థానికుల వివరాల ప్రకారం... లోకేశ్వరం మండలం కనకాపూర్ నుంచి గడ్డికట్టల లోడ్‌తో ట్రాక్టర్ భైంసాకు వస్తుంది. నిజామాబాద్ నుంచి భైంసా వస్తున్న ఆర్టీసీ బస్సు ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీ కొట్టింది. ట్రాక్టర్ ఇంజిన్, ట్రాలీ రెండు రోడ్డుపైనే బోల్తాపడ్డాయి. దీంతో ట్రాక్టర్ డ్రైవర్ ముత్యంకు స్వల్పగాయాలయ్యాయి. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు రోడ్డుపై పడి ఉన్న ట్రాక్టర్‌ను తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న ఆటో

భైంసాటౌన్: పట్టణంలోని భోకర్ చౌరస్తా వద్ద మంగళవారం రాత్రి ఆగి ఉన్న లారీని ఆటో ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. భైంసా నుంచి పుస్పూర్ వైపు ప్రయాణికులతో వెళ్తున్న ఆటో భోకర్ చౌరస్తా వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొంది. దీంతో కామోల్‌కు చెందిన ఆటో డ్రైవర్ రాంసింగ్ తోపాటు ఆటోలోని పుస్పూర్‌కు చెందిన ప్రణయ్, రాకేశ్‌లకు గాయాలయ్యాయి. స్థానికులు 108లో క్షతగాత్రులను చికిత్స నిమిత్తం భైంసాలోని ఏరియాస్పత్రికి తరలించారు.

చరిత్రను మార్చిన కేసీఆర్ దీక్ష

- చావునోట్లో తలపెట్టి తెలంగాణ సాధించిన కేసీఆర్
- మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 2009, నవంబరు 29న సీఎం కేసీఆర్ చేపట్టిన ఆమరణ దీక్ష తెలంగాణ చరిత్రను మార్చిందని నిర్మల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. సీఎం కేసీఆర్ దీక్ష చేపట్టి 14 ఏళ్లు పూర్తయిన సందర్భంగా జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు. తెలంగాణ అమరుల త్యాగలను గుర్తు చేసుకున్నారు. స్వరాష్ట్ర సాధన కోసం ఉద్యమ నేత కేసీఆర్ ప్రాణాలు పణంగా పెట్టి తెలంగాణ సాధించారన్నారు. తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో.. అంటూ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ముందుకు కదిలి తెలంగాణ సాధించారని వివరించారు. నాటి ఉద్యమసారథి కేసీఆర్ దీక్షబూనిన మహోన్నత లక్ష్యాన్ని మనం ఇప్పుడు స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా దీక్ష దివస్ స్ఫూర్తిని, అమరుల త్యాగాలని, జ్ఞాపకాలను, పోరాటాలను మరోసారి గుర్తుచేసుకునేందుకు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు బుధవారం దీక్ష దివస్ నిర్వహించనున్నట్లు తెలిపారు. వందలాది తెలంగాణ బిడ్డల బలిదానాలకు కారణమైన కాంగ్రెస్‌కు ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు సత్యనారాయణగౌడ్, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, మాజీ చైర్మన్ అప్పాల గణేశ్, గ్రంథాలయ చైర్మన్ రాజేందర్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు రాము, నాయకులు పాల్గొన్నారు.



జ్యోతిబాపూలేకు నివాళులర్పిస్తున్న ఐకేరెడ్డి

ఘనంగా పూలే వర్ధంతి..

జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో మంగళవారం మహాత్మా జ్యోతిబాపూలే వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

దిలావర్‌పూర్‌లో భారీ వర్షం

దిలావర్‌పూర్: మండల కేంద్రంతోపాటు బన్సపల్లి, న్యూలోలం, సిర్గాపూర్ తదితర గ్రామాల్లో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయింది. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అలాగే విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడటంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు.

నేలవాలిన మిర్చి పంట

కుంటాల: మండలంలోని ఓల, లింబా(కే), లింబా(బి), కుంటాల, అంబకంటి, దౌనెల్లి గ్రామాల్లో మంగళవారం అకాలవర్షం కురిసింది. మండలంలోని లింబా(కే) గ్రామ 15 మంది రైతులకు చెందిన ఇరవై ఎకరాల్లో మిర్చి పంటకు నష్టం జరిగింది. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.



మిర్చి పంటను చూపిస్తున్న రైతు పెంటాజి